
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 16 సెప్టెంబరు 2025



సీఎం విశాఖ రాక రేపు



- విమెన్ అండ్ చైల్డ్ హెల్త్ స్ర్కీనింగ్, 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాలు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ సదస్సుకు హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. ఆ రోజు ఉదయం తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి బీచ్‌రోడ్డులోని ... మిగతా 8వ పేజీలో

పోలవరం కాలువకు జలకళ



నక్కపల్లి మండలం రమణయ్యపేట వద్ద నీటితో నిండుగా వున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ

భారీ వర్షాలతో నీరు చేరడంతో నిండుగా..

నక్కపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నీటితో నిండుగా కనిపిస్తున్నది. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం, రమణయ్యపేట, సీతంపాలెం గ్రామాల మీదుగా పోలవరం ఎడమ కాలువ వెళుతున్నది. ఆరో ప్యాకేజీలో భాగంగా మండలంలో పనులు జరుగుతున్నాయి. సుమారు నెల రోజుల నుంచి తరచూ కుస్తున్న భారీ వర్షాలతో పోలవరం కాలువలోకి భారీగా నీరుచేరింది. పోలవరం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే కాలువ నిండుగా ఇలా దర్శనమిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నిండుకుండలా తాండవ



కళకళలాడుతున్న తాండవ జలాశయం

300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ఆయకట్టుకు 437 క్యూసెక్కులు విడుదల
- ఖరీఫ్‌కు నీటి సమస్య ఉండదని డీడీఈ వెల్లడి

నాతవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో తాండవ జలాశయంలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, సోమవారం 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 375.5 అడుగులకు చేరింది. కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు 437 క్యూసెక్కు నీటిని సరఫరా చేస్తున్న ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీరు ఆయకట్టుకు 75 రోజులపాటు సరఫరా చేయవచ్చని, అందువల్ల ఖరీఫ్‌కు నీటి సమస్య తలెత్తే అవకాశం వుండదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

పశు పోషణ, ఉద్యాన పంటలకు ప్రాధాన్యం

ప్రతి ఇంటిలో ఒకటికన్నా ఎక్కువ పశువులు ఉండేలా ప్రణాళిక

రైతులకు రాయితీపై మేలు జాతి పశువుల పంపిణీ

- కలెక్టర్ల సదస్సులో విజయకృష్ణన్ నివేదిక
- సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబునాయుడు

అనకాపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో పశు సంపద వృద్ధి, ఉద్యాన పంటలైన పూలు, కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాల్సిన అవసరముందని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సుకు హాజరైన ఆమె జిల్లా అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబునాయుడు ముందుంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో పశుపోషణతోపాటు, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.**



అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

భవిష్యత్తులో ప్రతి ఇంటిలో ఒకటికన్నా ఎక్కువ పశువులు ఉండేలా ప్రణాళిక రూపొందించినట్టు వివరించారు. మేలుజాతి పశువులను ఇతర రాష్ట్రాల నంచి కొనుగోలు చేసి, జిల్లా రైతులకు రాయితీపై అందించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ కోరారు. విశాఖ నగరం దగ్గరలో ఉన్నందున కూరగాయలు, పువ్వుల వినియోగం ఎక్కువగా ఉంటుందని, అనకాపల్లి జిల్లాలో పండించే కూరగాయలు పెద్దఎత్తున విశాఖకు రవాణా అవుతున్నాయని, అందువల్ల కూరగాయలు, పూల సాగు విస్తీర్ణం మరింత పెంచేలా అనుమతులన్నారు. ఔత్సాహిక రైతును గుర్తించి బిందుసేద్యం విధానంలో కూరగాయల సాగు, పూలతోటల పెంపకానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు వివరించారు. కలెక్టర్ విజయకృష్ణన్ సమర్పించిన నివేదికపై సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. పశు సంతతి వృద్ధి, ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వ నుంచి సహకారం అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఉద్యాన పంటల సాగు ద్వారా ఎక్కువమంది రైతులు లబ్ధిపొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.

యూరియాకు పరుగులు

ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరుతున్న రైతులు

అనవసర ప్రచారాలతో ఆందోళన

- రానున్న రోజుల్లో అవసరాలకు ఇప్పుడే కొనుగోలు
- ఇతర రైతులకు యూరియా అందని పరిస్థితి

చోడవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): **పుష్కలంగా వర్షాలు పడడం, వరి పంటకు ఎరువులు వేయాల్సి రావడంతో రైతులంతా ఒకేసారి ఎగబడుతున్నారు. దీంతో ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌లతోపాటు ప్రైవేటు దుకాణాల్లో ఎరువులు.. ముఖ్యంగా యూరియా శరవేగంగా అమ్ముడుపోతున్నది. రైతుల అవసరాలకు సరిపడ యూరియా రాకపోవడంతో ఆయా కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తున్నది.**



చోడవరంలో ఎరువుల దుకాణం వద్ద నిరీక్షిస్తున్న రైతులు



చోడవరంలో ప్రైవేటు షాపు వద్ద ఎరువుల కోసం ఎగబడుతున్న అన్నదాతలు

రాష్ట్ర ప్రభుత్వం మండలాలకు యూరియా నిల్వలు పంపిస్తున్నప్పటికీ, గ్రామాలకు చేరడంలో జాప్యం ఏర్పడుతుండడంతో రైతుల్లో అనవసర ఆందోళన పెరిగిపోతున్నది. సకాలంలో యూరియా వేయకపోతే పైరు సరిగా పెరగక, ధాన్యం దిగుబడి తగ్గిపోతుందేమోనని గుబులు చెందుతున్నారు. కొంతమంది రైతులు రెండు, మూడు దఫాల్లో వేయాల్సిన యూరియాను కూడా ఇప్పుడే కొనుగోలు చేస్తుండడంతో మిగిలిన రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందని పరిస్థితి నెలకొంది. రైతులు మిగిలిన అన్ని పనులు పక్కన పెట్టి యూరియా కోసం తీవ్రస్థాయిలో ... మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయ ఎంపిక జాబితా విడుదల

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,139 పోస్టులకు 1,134 భర్తీ
- 19న విజయవాడలో నియామక పత్రాలు అందజేత

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయ్యింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,139 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 1,134 పోస్టులు భర్తీ అయ్యాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల ఇతర పాఠశాలల్లో 625 పోస్టులకు 621, మునిసిపాలిటీల్లో 109 పోస్టులకు 108, గిరిజన సంక్షేమ శాఖలో 400 పోస్టులకు 400, జువెనైల్ వెల్ఫేర్‌లో ఐదు పోస్టులకుగాను ఐదూ భర్తీ అయ్యాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపాలిటీల్లో ఎస్‌జీటీ ఉర్దూకు అభ్యర్థులు లేకపోవడంతో ఐదు పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. దీని ప్రకారం విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు 24, ఇంగ్లీష్ 52, హిందీ 28, గణితం 57, ఫిజికల్ సైన్స్ 36, బయాలజీ 52, సోషల్ స్టడీస్ 88, ఎస్‌జీటీ తెలుగు 139 పోస్టులు భర్తీ అయ్యాయి. ఎస్‌జీటీ ఉర్దూలో పదికి ఆరు పోస్టులు మాత్రమే భర్తీచేశారు. అలాగే మునిసిపాలిటీల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగులో రెండు, ఇంగ్లీష్‌లో మూడు, గణితంలో రెండు, ఫిజికల్ సైన్స్‌లో మూడు, బయాలజీలో ఆరు, సోషల్ స్టడీస్‌లో మూడు, ఎస్‌జీటీ తెలుగులో 87 పోస్టులు, ఉర్దూలో మూడు పోస్టులకుగాను రెండు భర్తీచేశారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు ఏడు, హిందీ 11, గణితం ఏడు, ఫిజికల్ సైన్స్ 35, సోషల్ సైన్స్ ఐదు, ఎస్‌జీటీ తెలుగు 335 పోస్టులు భర్తీ అయ్యాయి. జువెనైల్ వెల్ఫేర్‌లో ఎస్‌జీటీ తెలుగు నాలుగు, పీఈటీ ఒక పోస్టు భర్తీ చేశారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న వెలగపూడిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించనున్నారు. ఈ సందర్భంగా టాపర్లు కొందరికి మాట్లాడే అవకాశం ఇవ్వనుండడంతో జిల్లా నుంచి ఇద్దరు, ముగ్గురి పేర్లతో జాబితాను అధికారులు పంపించారు. నియామక పత్రాలు అందుకునేందుకు అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 7.30 గంటలకు ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం స్కూల్ నుంచి బస్సులో వెలగపూడికి బయలుదేరుతారు. మెగా డీఎస్సీకి సంబంధించి డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ 94404 84917, 91772 92969, 96185 84051 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

తేలికపాటి జల్లులు

అనకాపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రావికమతం మండలంలో భారీ వర్షం కురిసింది. అనకాపల్లి, కశింకోట, మునగపాక, కోటవురట్ల, బుచ్చెయ్యపేట మండలాల్లో సాయంత్రం అక్కడక్కడ జల్లులు పడ్డాయి.

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజన్-2047

- అనువైన ప్రదేశంలో కేంద్రం ఏర్పాటు
- సదుపాయాలకు రూ.10 లక్షలు కేటాయింపు
- క్షేత్రస్థాయి సమాచారంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక
- చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, కన్వీనర్‌గా ప్రత్యేకాధికారి
- ఒక్కో కేంద్రానికి ఐదుగురు చొప్పున సచివాలయాల సిబ్బంది నియామకం
- వచ్చే నెల రెండో తేదీ నుంచి విజన్ కేంద్రాల్లో సేవలు



పాయకరావుపేట నియోజకవర్గం విజన్-2027 కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం

నక్కపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విజన్-2047కు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక విజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఎంపిక చేసిన ప్రాంతంలో అనువైన సచివాలయ భవనం లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. విజన్ కేంద్రంలో సదుపాయాల కల్పన, కంప్యూటర్లు, ఏసీ పరికరాలు, ఫర్నీచర్ కోసం ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలు కేటాయిస్తుంది.. విజన్ సెంటర్‌ను పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదిక ద్వారా పంపేందుకు ... మిగతా 8వ పేజీలో



చురుగ్గా సాగుతున్న విజన్ సెంటర్ ఏర్పాటు పనులు

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

- రేపటి నుంచి రెండో తేదీ వరకు అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- అసంక్రమిత వ్యాధుల నిర్ధారణకు స్ర్కీనింగ్ పరీక్షలు
- 49 ఏళ్లలోపు మహిళలందరికీ వైద్య సేవలు

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీటవేస్తూ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆర్యో కేంద్రాలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ కోసం మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఐసీడీఎస్, ఆయుష్ విభాగంతో సమన్వయం చేసుకుంటూ వైద్య, ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నది. బీపీ, షుగర్, గర్భాశయ/ నోటి/ రొమ్ము ... మిగతా 8వ పేజీలో



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దంపతులు

నూకాంబికను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దంపతులు సోమవారం అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రా లు సమర్పించారు. బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మాధవ్ దంపతులను సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విరివిగా డీసీసీబీ రుణాలు

- ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.3 వేల కోట్లు
- ఇప్పటికే రూ.2,700 కోట్ల బిజినెస్
- భూములపై రూ.6 లక్షల వరకు వ్యవసాయేతర రుణాలు
- డీసీసీబీ చైర్‌పర్సన్ కోన తాతారావు



మాట్లాడుతున్న డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

పాయకరావుపేట/ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాది రూ.3 వేల కోట్ల వ్యాపార లక్ష్యం కాగా ఇప్పటికే రూ.2,700 కోట్ల వ్యాపారం చేసినట్టు డీసీసీబీ చైర్‌పర్సన్ కోన తాతారావు తెలిపారు. సోమవారం ఆయన పాయకరావుపేటతోపాటు మండలంలోని నామవరం పీఏసీఎస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఏర్పాటు చేసిన మీడియా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. 4.5 లక్షల మంది రైతులకు రుణాల మంజూరు, ఇతర సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తమలపాకు తోటలకు ఎకరాకు రూ.లక్ష వరకు రుణం ఇస్తున్నామని, దీనిని రూ.3 లక్షలకు పెంచే అలోచన వుందని వెల్లడించారు. రైతులకు పంట రుణం ఇచ్చిన భూమిపైనే వ్యవసాయేతర అవసరంగా రూ.6 లక్షల వరకు స్వల్పకాలిక రుణం ఇస్తున్నామని, దీనిని రూ.10 లక్షలకు పెంచుతామని చెప్పారు. పంట రుణాలను నాలుగు శాతం వడ్డీకే అందిస్తున్నామని, సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని కోన తాతారావు తెలిపారు. హౌసింగ్, ఎడ్యుకేషన్ లోన్లుతోపాటు గొర్రెలు, మేకలు, పాడిపశులు, కోళ్ల పెంపకందారులకు కూడా రుణాలు మంజూరుచేస్తామన్నారు. బంగారంపై గ్రాముకి రూ.7 వేల వరకు రుణం మంజూరుచేస్తామన్నారు. కౌలు రైతులు ఐదుగురు కలిపి గ్రూపుగా ఏర్పడితే పంట రుణాలు ఇస్తామన్నారు. డీసీసీబీ పరిధిలో 45 పీఏసీఎస్‌లు జరిగిన ... మిగతా 8వ పేజీలో

రాంబిల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలి

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ చిట్టిబాబు

రాంబిల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా రాంబిల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన ఎరిపిల్లి చిట్టిబాబు సోమవారం టీడీపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే విజయకుమార్‌ను అచ్యుతాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో కల్పించిన సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులకు సేవలు అందించాలని చిట్టిబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవింద్, టీడీపీ నాయకులు ఎరిపిల్లి అజయ్, చెల్లూరి ఆనంద్, కారే రాముడు, పాలెపు అప్పలరాజు, గనగళ్ల నూకరాజు, వాడ్రె వెంకటరావు, లంకాడ గోవింద్, జి.సత్తిబాబు,తాతారావు, చంటి చెల్లూరి సత్తిబాబు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ నిర్మాణానికి లక్ష విరాళమందిస్తున్న దశావతారం దంపతులు

మునగపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కొయిలాడ దశావతారం దంపతులు లక్ష రూపాయల విరాళం ఇచ్చాడు. గ్రామంలో సతకంపట్టు వద్ద గౌరీయూత్ యువకులు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి కొంతమంది నగదు, మరికొంతమంది మెటీరియల్ రూపంలో ఇస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

దేవాన్ష్‌కు ప్రపంచ రికార్డుపై టీడీపీ నేతల సంబరాలు



పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ చదరంగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పడంతో సోమవారం వేంపాడులో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పాఠశాలల్లో పిల్లలకు బిస్కట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, టీడీపీ నేతలు కె.శివ రామకృష్ణ, కళ్లేపల్లి వెంకటపతిరాజు, అయినంపూడి రవిరాజు, పల్లా రాంబాబు, వరాలరాజు, సూర్యనారాయణరాజు, దారబాల నర్సింహమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలను తప్పకుండా వేయించాలి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు వడ్డి శ్రీధర్ అన్నారు. మండలంలోని పీఎల్‌పురంలో సోమవారం 852 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18,876 పశువులు ఉన్నాయని, మండలానికి 18,900 టీకాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పీఎల్‌పురం సర్పంచ్ పడాల దివాణం, ఎంపీటీసీ సభ్యుడు నాగం వెంకటరత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

'ఏపీలో సంక్షేమానికి కేంద్ర సహకారం'

మునగపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని బీజేపీ జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యుడు బద్దెం సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో డిపో-2 లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఏపీలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మొల్లేటి సత్యనారాయణ, డీలర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రాంబిల్లిలో 90 వరినాట్లు పూర్తి

రాంబిల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 90 శాతం వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. సోమవారం ఆమె మండలంలోని దిమిలిలో నాట్లు వేసిన వరి పొలాలను పరిశీలించారు. మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 5,653 ఎకరాలు కాగా 90 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. ఇప్పటివరకు 280 టన్నులు యూరియా, 30 టన్నులు డీఏపీలను పంపిణీ చేశామన్నారు.

అండర్ పాస్, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

ఎలమంచిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కొక్కిరాపల్లి హైవే జంక్షన్ వద్ద ఐదు గ్రామాల ప్రజల సురక్షిత రాకపోకలు సాగించేందుకు అండర్ పాస్, సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం కలెక్టరు కార్యాలయాధికారికి వినతిపత్రం అందజేసినట్టు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తెలిపారు. హైవే వద్ద సర్వీసు రోడ్డు లేకపోవడంతో మూడు కిలోమీటర్లు దూరం నుంచి యూటర్న్ తీసుకుని రావాల్సి వస్తుందన్నారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని వాటిని నిర్మించాలని కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఎస్.రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని కోనవానిపాలెం, సారిపల్లిపాలెం, అడ్డరోడ్డు తిమ్మాపురం చేపల మార్కెట్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కోటవురట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన ఉదయం పది గంటలకు ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు.

మనడబ్బులు-మనలెక్కలు ఆన్‌లైన్ యాప్‌పై శిక్షణ

అచ్యుతాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్వాక్రా మహిళల కోసం మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమానికి ఏర్పాటు చేసిన యాప్‌పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్ వల్ల ఉపయోగాల గురించి వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు వివరించారు.

సెజ్‌కి మడుతూరు మీదుగా ప్రత్యామ్నాయ రోడ్డు

» వారంలో పనులు పూర్తి » తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మడుతూరు మీదుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కేవలం వంద మీటర్లు రోడ్డు వేస్తే వాహన రాకపోకలకు అనువుగా ఉంటుంది. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండడంతో ట్రాఫిక్‌ని రాంబిల్లి మండలం వెంకటాపురం, సెజ్ పునరావాస కాలనీ మీదుగా మళ్లించారు. దీంతో కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులను తీసుకువెళ్లే బస్సులతో పాటు ముడి సరుకు, యంత్ర సామగ్రి తీసువెళ్లే భారీ వాహనాలు ఈరోడ్డు గుండా ప్రయాణించడంతో సెజ్ పునరావాస కాలనీలోని రోడ్డు ఛిద్రమైపోయింది. దీంతో ఎమ్మెల్యే విజయకుమార్ మడుతూరు శివారు నుంచి నేరుగా సెజ్‌లోకి వెళ్లేలా అధికారులతో సర్వే జరిపి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో గల మడుతూరు జంక్షన్ నుంచి తంతడి వరకు తారురోడ్డు ఉంది.



సెజ్ ముఖద్వారం వద్ద రోడ్డు వేస్తున్న దృశ్యం

అయితే మడుతూరు పొలిమేర నుంచి ఎస్‌సీ కాలనీ వెనుక నుంచి నేరుగా సెజ్‌లోకి గ్రావెల్ రోడ్డు 30 అడుగుల మేర వేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. సెజ్ నుంచి వచ్చే వాహనాలు మడుతూరు జంక్షన్‌కి వస్తే గాజువాక, అనకాపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో గల హైవేకి సునాయాసంగా వాహనాలు వెళ్లవచ్చు. దీంతో ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయి.



తీరంలో మత్స్యకారుల చేపల వేట

పూడిమడక తీరంలో సోమవారం ఉదయం చేపల వేట నిర్వహిస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక శివారు జాలారి పాలెం మత్స్యకారులు సోమవారం ఉదయం చేపల వేట నిర్వహించారు. ఎక్కువ దూరం వెళ్లలేక తీరానికి దగ్గరగా వేట సాగించారు. అయితే కోనెం చేపలు వీరి గాలాలకు చిక్కాయి. సోమవారం వంద పడవలకు పైగా చేపల వేటకు వెళ్లాయి. వీరి గాలాలకు నామమాత్రంగా కోనెం చేపలు పడ్డాయి.

ఎలమంచిలిలో 100 పడకల ఆస్పత్రికి ప్రణాళిక

» ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో వంద పడకల ఆస్పత్రి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం సీహెచ్‌సీ ఆవరణలో ఆస్పత్రి వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అన్ని విధాలా వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రిని గత పాలకులు అసంపూర్తిగా నిర్మించారన్నారు. ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలంటే కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా జిల్లా కలెక్టరు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. తానైతే 100 పడకల ఆస్పత్రి నిర్మాణం ధ్యేయంగా ఉన్నానని, అందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆస్పత్రి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి వైద్యురాలు నిహారికతో మాట్లాడి పలు సూచనలు అందించారు.



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

నూతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే విజయకుమార్, కన్వీనర్‌గా ఆస్పత్రి వైద్యాధికారిణి నిహారిక, సభ్యులుగా తహశీల్దారు కె.వరహాలు, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, గుర్రాల శేఖర్, గొర్లె రత్నాజీ, పిట్టా దాసుబాబులను నియమించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, నేతలు లవుడు లోవరాజు, కర్రి ఝాన్సీ, కొఠారు శ్రీను, చిట్టిబాబు పాల్గొన్నారు.

23 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ 23 మందికి రూ.15 లక్షల హామీ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మునిసిపాలిటీ తెరువుపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీవ ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ జాహ్నవి, ఏఓ మోహనరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే విజయకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ గత వైసీపీ పాలకుల చేతకానితనం వల్లనే జల్‌జీవన్ మిషన్ పథకం కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.వరహాలు, ఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ గోవింద్ జన్మదిన వేడుకలు



ఎంపీపీ బోదెపు గోవింద్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న వైసీపీ నేతలు

ఎలమంచిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ జన్మదిన వేడుకలను సోమవారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తాల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నేతలు గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు, పిల్లా త్రినాథ్, దూది నరసింహమూర్తి, పాలరౌతు స్వామి, బొడ్డేటి లక్ష్మణ్, మోహన్ రాధా, ఎడ్ల వాసు పాల్గొన్నారు.

తక్కువ ధరకు పాలు కొనుగోలు చేస్తున్నారంటూ రైతుల నిరసన

ఆర్థికంగా నష్టపోతున్నామంటూ ఆవేదన

రైతులకు బోనస్ ఇవ్వని విశాఖ డెయిరీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీకి పాలు పోసి తీవ్రంగా నష్టపోతున్నామని ఆరోపిస్తూ మడుతూరు పాడి రైతులు సోమవారం పాలు ఉత్పత్తి దారుల సంస్థ వద్ద పాలకేన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాల సంఘం మాజీ అధ్యక్షుడు శనివాడ ఆనందరావు మాట్లాడుతూ ఇతర డెయిరీలు కన్నా విశాఖ డెయిరీలో తక్కువ ధరకు పాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. గతంలో పాల ధర ఏవరేజ్‌గా లీటరు రూ. 38 ఉండగా.. ప్రస్తుతం రూ.34కి పడిపోయిందన్నారు. రైతుల నుంచి సేకరిస్తున్న పాలధరను తగ్గించారే కాని డెయిరీ విక్రయించిన పాలకు మాత్రం లీటర్‌కి రెండు రూపాయలు పెంచారన్నారు. రైతులకు ప్రతి సంవత్సరం ఇచ్చే ఏరువాక బోనస్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల షేర్ ధనం రూ.230 కోట్లు, ట్రస్ట్ డొనేషన్ గత పది సంవత్సరాల్లో రూ.500 కోట్లు ఏమయ్యాయో విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డెయిరీలో అవినీతిపై విచారణకు శాసన సభ కమిటీని నియమించినప్పటికీ ఇంతవరకు ఫలితం కనబడలేదన్నారు. విశాఖ డెయిరీని కంపెనీ యాక్ట్ నుంచి కో-ఆపరేటివ్ వ్యవస్థలోకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. శాసనసభ కమిటీ తమ గ్రామానికి వచ్చి రైతులను విచారిస్తే అన్ని విషయాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.



మడుతూరు పాల కేంద్రం వద్ద పాలకేన్‌లతో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

మన డబ్బు-మన లెక్కలతో మోసాలకు చెక్

» వెలుగు ఏపీఎం బాలరాజు



మంగళవరపుపేటలో మానవహారంగా ఏర్పడిన డ్వాక్రా మహిళలు

మునగపాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మోసాలకు చెక్ పెట్టడం కోసం మన డబ్బు-మన లెక్కలు కార్యక్రమం జరుగుతోందని వెలుగు ఏపీఎం బాలరాజు అన్నారు. మండలంలో మంగళవరపుపేట, ఒంపోలు గ్రామాల్లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పొదుపు, రుణం లావాదేవీలుగా ప్రతీ సభ్యులురాలు తెలుసుకునేందుకు అనుగుణంగా ప్రక్షాళన జరుగుతోందని చెప్పారు. ఫోన్ ద్వారా డ్వాక్రా సమాచారం తెలుసుకోవచ్చునని తెలిపారు. ర్యాలీలు, మానవహారాలతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరత లేదు : ఏవో

ఎస్.రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి రైతులకు యూరియా కొరత లేదని మండల వ్యవసాయాధికారిణి సౌజన్య తెలిపారు. కొరుప్రోలు పీఏసీఎస్‌లో ఉన్న యూరియా స్టాక్‌ను సోమవారం సాయంత్రం తహశీల్దార్ రమేష్‌బాబుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యూరియా కోసం రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఐదు రైతు సేవా కేంద్రాల్లో 62 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అడ్డరోడ్డులో గల మన గ్రోమోర్‌లో 12 టన్నుల యూరియా స్టాక్ ఉండగా.. మరో 25 టన్నుల యూరియా రవాణాలో ఉందన్నారు. తహశీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఎక్కడైన నిబంధనలు పాటించకుండా యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బల్క్‌డ్రగ్ వద్దంటూ వినూత్న ఆందోళన

» మెడకు ఉరితాళ్లు వేసుకొని మత్స్యకారులు నిరసన

నక్కపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలైన వదులుకుంటాం కానీ.. సముద్రానికి.. ప్రజలకు హాని కల్గించే బల్క్ డ్రగ్ పార్కును మాత్రం అంగీకరించబోమని రాజయ్యపేట మత్స్యకారులు సోమవారం ఆందోళన చేపట్టారు. మెడకు ఉరితాళ్లు తగిలించుకుని తమ ప్రాణాలు తీయడానికే ఇటువంటి రసాయన పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గత ఎన్నికల్లో టీడీపీకి మా గ్రామం నుంచి 2 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చామని, ఇప్పుడు తమ ఆవేదనను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. శాంతియుతంగా నిరసన చేపడుతుంటే కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అందుకే రాజకీయాలకతీతంగా తామంతా బల్క్‌డ్రగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నామని స్పష్టం చేశారు. తమపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ కె.కుమారస్వామి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం నాయకులు ఎం.రాజేశ్, మత్స్యకార నాయకులు పిక్కి. సత్తియ్య, ఎరుపల్లి నాగేశ్; మైలపల్లి మహేశ్‌బాబు, టీడీపీ గ్రామఖ అధ్యక్షుడు పిక్కి. గంగరాజు, టీడీపీ నాయకుడు పిక్కి. కోదండరావు తదితరులు పాల్గొన్నారు.



మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మరో 21 మందిపై కేసు నమోదు

మండలంలోని రాజయ్యపేట గ్రామంలో సోమవారం ఎటువంటి అనుమతు ల్లేకుండా ప్రభుత్వ స్థలాల్లో ధర్నా చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. పోలీసులు,అధికారుల మాట వినకుండా, తమ విధులకు ఆటంకం కల్గించారని చెప్పారు. ఈ మేరకు రాజయ్యపేట చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మరో 21మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

సీపీఎం నేత అప్పలరాజు గృహ నిర్బంధం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజును ధర్మవరం అగ్రహారంలోని స్వగృహంలో పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో మత్స్యకారులు చేస్తున్న నిరసనకు మద్దతివ్వడానికి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ నిర్బంధాలకు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటును వ్యతిరేకించిన హోం మంత్రి అనిత అధికారంలోకి వచ్చిన తరువాత దాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆయన ప్రశ్నించారు.



అప్పలరాజును అడ్డుకొని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

రైతులకు సకాలంలో రుణాలు

» డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా రైతులకు సకాలంలో రుణాలందిస్తామని డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. మండలంలోని నామవరం సొసైటీలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య బ్యాంకుల వలె సొసైటీలలో రైతులకు త్వరితగతిన రుణాలను మంజూరు చేస్తామన్నారు. రైతులకు అతి తక్కువ వడ్డీకే రూ.5 లక్షల వరకు ఎస్‌టీ రుణాలను అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సొసైటీల ద్వారా మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని పంటలకే పంట రుణాలు అందించేవారని, ప్రస్తుతం రైతు ఏ పంట వేసుకున్నా రుణం అందిస్తామన్నారు. గతంలో తమలపాకుల పంటకు రుణం ఇచ్చేవారు కాదని, ఇప్పుడు లక్ష రూపాయల వరకు రుణం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతులకు రూ.5లక్షల ఎస్‌టీ రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెడ్డం కన్నబాబు, డీసీసీబీ సీఈవో వర్మ, జనసేన నేతలు బోడపాటి శివదత్, సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీరంగం వీరభద్రరావు, పక్కుర్తి నూకరాజు పాల్గొన్నారు.



రైతులకు రుణాల చెక్కును అందిస్తున్న డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి తాతారావు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎలమంచిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకుడు వెంకటపతిరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ బాధ్యులు పట్టణంలోని పలు పాఠశాలలతో పాటు జంపపాలెం ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. మండలంలోని 50 పాఠశాలకు డొక్కా సీతమ్మ ఎండీఎం మెనూ ఫ్లెక్సీలను హెచ్‌ఎంలకు అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పదోన్నతి పొందిన గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెకెఎల్‌ఎన్.ధర్మారావు, మండల కార్యదర్శి మల్లిపాటి సత్యనారాయణ, ప్రతినిధులు బొడ్డేడ సత్యనారాయణ, వీరభద్రరావు, నీరజ, ఏ.చంద్రశేఖర్, సర్వేశ్వరరావు, సత్యారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో వున్న 4 డీఏలు విడుదల చేసి, పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డీ కొండలరావు డిమాండ్ చేశారు. సోమవారం నిరసన వారోత్సవాల్లో భాగంగా నక్కపల్లిలో మండలశాఖ అధ్యక్షుడు వై.కృష్ణ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్.విజయశ్రీ, ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, సంఘ ప్రతినిధులు సునీల్, కె.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, కె.రంగబాబు, వెంకట్రావ్, కాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలతో ఆక్వా పరిశ్రమ కుదేలు

ఆర్.శంకరరావు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో ఆక్వా పరిశ్రమ తీవ్రంగా నష్టపోతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో సోమవారం నిర్వహించిన సీఐటీయూ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ విధించిన సుంకాల వలన ఆక్వా పరిశ్రమతో పాటు కార్మికులు, రైతులు ఇబ్బందులు పడతారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, వసంత, రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట ఎంపీడీఓగా విజయలక్ష్మి



పాయకరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ఎంపీడీఓగా పి.విజయలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం బుచ్చెయ్యపేట ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఆమె ఎంపీడీఓగా పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈమె గతంలో మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఆమె ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్టు కార్యాలయ ఉద్యోగులు తెలిపారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

బాలల పరిరక్షణ జిల్లా ప్రతినిధి లోవరాజు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకట్ట వేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బాలల పరిరక్షణ జిల్లా ప్రతినిధి లోవరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పరాపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపాలని సూచించారు. బాల కార్మికులతో పనిచేయించడం నేరమని, ఎక్కడైన అలా చేయించినట్టు తెలిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, మహిళాపోలీసు, ఆశాలు పాల్గొన్నారు.

కోటవురట్ల ఎంపీడీవోగా చంద్రశేఖర్



పదోన్నతి ఉత్తర్వులు అందుకుంటున్న చంద్రశేఖర్

కోటవురట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ పదోన్నతి పొందారు. ఈమేరకు సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి పదోన్నతి ఉత్తర్వులను చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈయన గత నాలుగైదు పర్యాయాలు ఇన్‌చార్జీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఏవోగా పనిచేస్తున్నారు. జూన్ నెల ఎంపీడీవోగా పనిచేస్తున్న కాశీవిశ్వనాథం ఉద్యోగవిరమణ పొందారు. అప్పటి నుంచి ఆస్థానం ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రశేఖర్ వ్యవహరిస్తున్నారు. పదోన్నతిపై ఆయన్ని కోటవురట్ల ఎంపీడీవోగా నియమించారు.

17 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

పాయకరావుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తయారుచేసిన స్మార్ట్ రేషన్ కార్డులు పాయకరావుపేట మండలంలో ఈనెల 17వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నామని తహసీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు తెలిపారు. ఈనెల 17వ తేదీన నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయంలో మంత్రి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక

▸▸ డ్వాక్రా సంఘాల్లో అవకతవకల అడ్డుకట్టకు ప్రభుత్వం చర్యలు
▸▸ 'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌పై అవగాహన సదస్సులో డీఆర్‌డీఏ పీడీ సచీదేవి



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సచీదేవి

సబ్బవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.సచీదేవి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం నూతనంగా ఆవిష్కరించిన 'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌పై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అవకతవకలను అడ్డుకునేందుకు ఈ యాప్‌ను ప్రభుత్వం రూపకల్పన చేసినట్టు చెప్పారు. సభ్యులు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ఫోన్‌లోనే అన్ని లెక్కలు ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు, కట్టిన సొమ్ము, బ్యాలెన్స్ తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చునని వివరించారు. అలాగే, రానున్న రోజుల్లో మహిళల ఆరోగ్య పరిస్థితిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా సాంకేతికతను చొప్పించి ఈ యాప్‌ను డిజైన్ చేశారన్నారు. పదిహేను శాతం వృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) భాగస్వామ్యంతో ఈ లక్ష్యం సాధించాలన్నారు. మునగ, తేనెటీగలు, షేడ్ నెట్స్, ఈజీ మాల్స్ తదితర వ్యాపార ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరుగుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వెంకటరమణ, ఏపీవో సీహెచ్. శ్రీనివాసరావు, వీవోఏ ఎం.త్రిమూర్తులు, ఎంఎస్‌డీ సునీత, గ్రామ పెద్దలు రేసు పూడి రమణ, కర్రి శ్రీనివాసరావు, మహిళా సామాఖ్య అధ్యక్షురాలు కోన విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ వినతి



ఇన్‌చార్జి తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ మండల ప్రతినిధులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిభూషణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నెంబరు 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ పరిమితిని 25 లక్షలకు పెంచాలని కోరారు. అలాగే, యాప్‌లను, అసెస్మెంట్ బుక్ లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు కొణతాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయానికి ఆనుకొని ఉన్న రామునాయుడు కాలనీలో సోమవారం సాయంత్రం బహిరంగంగా పలువురు పేకాట ఆడుతుండగా పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.4090 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మోటారు సామగ్రి చోరీపై పోలీసులకు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీనగరంలో మోటారు సామగ్రి చోరీకి గురైనట్టు పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. మరువాడ శ్రీనివాసరావు ఇంట్లోకి దొంగలు చొరబడి జెట్ మోటార్, నాలుగు పైపులను అపహరించుకు పోయినట్టు బాధితుడు ఫిర్యా చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆదిరెడ్డిపాలెంలో తాగునీటి బోరు ఏర్పాటు

సబ్బవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో మం డల పరిషత్ నిధులతో సోమవారం తాగు నీటి బోరు ఏర్పాటు చేశారు. తొలుత ఈ పనులను ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఆర్ఈ సీఎస్ మాజీ చైర్మన్ కొటాన అప్పారావు, ఆదిరెడ్డి రమణ, పోతుబాబు, గొర్లి కనకం, సన్నిబాబు, రామ కృష్ణ, మడ్డు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వందేభారత్' ఎక్స్‌ప్రెస్ సర్వీసు మార్పు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు (20707/20708) రోజులను సవరించామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ప్రస్తుతం వారంలో గురువారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉన్న 20707, 20708 నంబర్లు గల వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు డిసెంబరు 2 నుంచి వారంలో సోమవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో అందుబాటులో ఉండేలా సవరించామని పేర్కొన్నారు. దీంతో ఈ సర్వీసులు డిసెంబరు 2 నుంచి ప్రతి సోమవారం అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. సవరించిన మార్పుల ద్వారా గురువారం అందుబాటులో ఉండేలా డిసెంబరు 2 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని సూచించారు.

దారులు దారుణం

▸▸ ప్రమాదకరంగా అనకాపల్లి- చోడవరం రోడ్డును ఆనుకొని ఉన్న గ్రామాలకు వెళ్లే మలుపులు
▸▸ గుంతలు పడి, రాళ్లు తేలడంతో వాహనదారులకు ఇబ్బందులు



బొజ్జన్నకొండకు వెళ్లే మలుపు వద్ద...



తుమ్మపాల నుంచి దిబ్బపాలేనికి వెళ్లే మలుపు వద్ద ఏర్పడిన గుంతలో నిలిచిపోయిన వర్షపునీరు



వెంకుపాలేనికి వెళ్లే మలుపు వద్ద..

తుమ్మపాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన అనకాపల్లి- చోడవరం రోడ్డును ఆనుకొని ఉన్న పలు గ్రామాలకు వెళ్లే మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే మలుపు వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో బొజ్జన్నకొండ వైపు ప్రయాణించేవారు ఈ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. తుమ్మపాల నుంచి వెంకుపాలెం గ్రామానికి వెళ్లే మలుపు వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తుమ్మపాల ప్రధాన జంక్షన్ కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటువంటి చోట గోతులు పడడంతో ఇటు పాదచారులు, అటు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. తుమ్మపాల నుంచి దిబ్బపాలెం వెళ్లే మలుపు వద్ద ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి ఇదే పరిస్థితి నెలకొంటుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు ప్రతి శనివారం ఈ జంక్షన్ వద్ద పెద్దఎత్తున తుమ్మపాల సంత జరుగుతుంటుంది. దీంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో గుర్తించలేని పలువురి వాహనాలు అదుపు తప్పి గాయాలకు గురవుతున్నారు. ఇక తుమ్మపాల నుంచి మార్టూరు గ్రామానికి వెళ్లే మలుపు పూర్తిగా ఛిద్రమైంది. గోతులు ఏర్పడి తారు లేయరు లేచిపోయి పిక్క బయటకు తేలుతోంది. ఇటుగా నిత్యం క్వారీ, క్రషర్ల నుంచి అధిక లోడులతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుం టాయి. ఈ కారణంగా రోడ్డు మరింత దారుణంగా మారింది. దీనికి తోడు గ్రామాల్లోకి వెళ్లే మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, విద్యుత్ దీపాలు వంటివి ఏర్పాటు చేయలేదు. ఫలితంగా రాత్రి వేళ ప్రయాణాలు చేసేవారి అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. వర్షాలు కురిసే సమయంలో గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలకు నిలయాలుగా తయారవుతున్నాయి.

అనకాపల్లి- చోడవరం రోడ్డులోని తుమ్మపాల నుంచి దాదాపు మామిడిపాలెం వరకు ఇదే దుస్థితి నెలకొనడంతో ఈ రోడ్డులో ప్రయాణించే వారు భయాందోళన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం చేపట్టకపోయినా కనీసం గోతులనైనా పూడ్చాలన్న ఆలోచన అధికారుల్లో లేకపోవడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ దిశగా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

నియోజకవర్గంలో 72 వేల మందికి స్మార్టు రేషన్ కార్డులు

సరకుల పంపిణీలో పారదర్శకత : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



వృద్ధురాలికి స్మార్టు రేషన్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల



దేశపాత్రునిపాలెంలో పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కశింకోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ వ్యవస్థ పక్కా అమలుతో పాటు అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకే కూటమి ప్రభుత్వం స్మార్టు రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని నర్సింగబిల్లి, చింతపాలెం గ్రామాల్లో సోమవారం ఆయన పలువురు లబ్ధిదారులకు ఈ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. రేషన్ వ్యవస్థలో పారదర్శకత తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించినట్టు చెప్పారు. స్మార్ట్ కార్డులపై ముద్రించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినప్పుడు నేరుగా ఒక వెబ్ లింక్ ఓపెన్ అయి కార్డు హోల్డర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం లభిస్తుందన్నారు. మండలస్థాయి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి మండలం పాపయ్యపాలెం, సంతపాలెం గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పౌర సరఫరాల శాఖ అందించిన కార్డులు కలిగి ఉన్న వారికి ఈ స్మార్ట్ రేషన్‌కార్డుల రూపంలో అందిస్తున్నామని చెప్పారు. అనకాపల్లి నియోజకవర్గంలో 72వేల కార్డులు అందించనున్నామని వివరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిభూషణరావు, సివిల్ సప్లయి డీటీ లీలా, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, శెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, తుమ్మపాలలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి పలువురికి స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు. గ్రామ నాయకులు వియ్యపు సింహాచలం, పల్లెల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు పలువురికి అందజేశారు. ఏ డిపోలోనైనా స్మార్ట్ కార్డు స్కాన్ చేసి రేషన్ సరుకులు పొందే అవకాశముందన్నారు. వీఆర్వో సాయికుమార్, కూటమి నాయకులు మట్టా శివకుమార్, కరణం అప్పారావు, మూర్తి, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని సోమవారం పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడటంతో గత శుక్రవారం ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునః ప్రారంభించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్‌ల్లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

ఎన్టీఆర్ కాలనీలో ఖాళీ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

సబ్బవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడివాడ, పైడివాడఅగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాలనీ (గతంలో జగనన్న కాలనీ)లో ఆక్రమణకు గురవుతున్న ఖాళీ స్థలాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఎరుకునాయుడుపాలేనికి చెందిన మొల్లి నవనీత వర్మ సోమవారం వీఎంఆర్‌డీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇక్కడ లే-అవుట్ వేసిందని పేర్కొన్నారు. ఇందులో కమ్యూనిటీ అవసరాల కోసం కొన్ని చోట్లు సర్వే నెంబరు 73, 75లలో ఖాళీ స్థలాలు విడిచిపెట్టారన్నారు. సదరు స్థలాలను కొంతమంది ఆక్రమించి విక్రయించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంతో ఈ సమస్యపై ఫిర్యాదులు చేసినా స్పందించేవారు కరువయ్యారన్నారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో ఉన్న సదరు ఖాళీ స్థలాలకు రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు.

సింహాద్రి ఎన్టీపీసీ సేవలు అభినందనీయం

▸▸ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన రెసిడెన్షియల్ పాఠశాల డార్మెటరీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు



డార్మెటరీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

పరవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.50లక్షలతో తానాంలో గల జ్యోతిబా పూలే ప్రభుత్వ బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్మించిన డార్మెటరీ భవనాన్ని సోమవారం సింహాద్రి హెచ్ఆర్ ఏజీఎం బీబీ పాత్రతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సింహాద్రి కృషి చేస్తుందన్నారు. మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, నాయకులు వర్రి పరదేశినాయుడు, మోటూరు సన్యాసినాయుడు, చింతకాయల ముత్యాలు, వియ్యపు చిన్న, రొంగలి నాగేష్, బొడ్డపల్లి అప్పారావు, బుగిడి రామగోవిందరావు, బొద్దపు శ్రీనివాసరావు, సిరపురపు అప్పలనాయుడు, పిళ్లా శివకృష్ణ, సీఎస్ఆర్ ప్రతినిధులు ప్రకాశరావు, ఎస్.పి.సింగ్, ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

లంకెలపాలెం : వైసీపీ హయాంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గాడి పెడుతున్నారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 85వ వార్డు గంగిరెడ్ల కాలనీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామంలో రూ.1.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, కూటమి నాయకులు దుల్ల రాము నాయుడు, కరణం నరసింగరావు, జెర్రిపోతుల అప్పారావు, గవర సోమశేఖర్, ఏదూరి గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

▸▸ ఇద్దరు నిందితుల అరెస్టు
▸▸ ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం



నిందితులను చూపుతూ.. వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

లంకెలపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామనగర్ కాలనీ, రామాలయం ప్రాంతాల్లో గత రెండు నెలల వ్యవధిలో జరిగిన రెండు దొంగతనాల కేసులను పరవాడ పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు సోమవారం రాత్రి తెలిపిన వివరాలివి. లంకెలపాలెం దరి శ్రీరామనగర్ కాలనీలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకట లక్ష్మి ఇంట్లో ఈ ఏడాది జూన్ 21న, రామాలయం వీధిలో నివాసముంటున్న దొంకాడ విమలాకుమారి ఇంట్లో జూలై 12న చోరీలు జరిగాయి. ఈ రెండు కేసుల్లో పదిన్నర తులాల బంగారం, 20 తులాల వెండిని దొంగలు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో విచారణ జరపగా తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి దరి పటాన్ చెరువు ప్రాంతానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం సమీపంలోని గంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణ చైతన్యలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వీరిద్దరినీ సోమవారం మధ్యాహ్నం లంకెలపాలెం ఐఓసీ పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా, క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

▸▸ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెల రోజుల పాటు ప్రక్రియ ▸▸ పోస్టర్ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి



కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరిగా వేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి సూచించారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం సోమవారం ప్రారంభమైన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద అక్టోబరు 15వ తేదీ వరకు ఈ టీకాలు వేస్తారని, పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి అధికారులు నిర్ణీత సమయంలో టీకాల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామమోహనరావు మాట్లాడుతూ జిల్లాలో 3,54,200 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నెల రోజుల పాటు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో...

సబ్బవరం : పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధి కారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలోని గుల్లేపల్లిలో సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారితో కలిసి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు, డాక్టర్ బి.సంధ్య, ఈవోపీఆర్‌డీ చైతన్య, సర్పం చులు బండారు మంగ, గండి అరుణ, బైలపూడి గౌరీ, గ్రామ పెద్దలు బం డారు శ్రీను, బైలపూడి రామారావు, గజ్జినర్సింగరావు పాల్గొన్నారు.



తానాంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

తానాం గ్రామంలో...

పరవాడ : పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీకి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం తానాం గ్రామంలో ఆవిష్కరించారు. పశువులకు చలికాలంలో గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. పశువైద్య శాఖ ఏడీ కీర్తి రామకృష్ణ, పశు వైద్యాధికారులు సురేష్ కుమార్, అనూష, సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, కూటమి నాయకులు డీఎంఎల్ నాయుడు, సిరపురపు అప్పలనాయుడు, ముత్యాలు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాడేరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు సోమవారం ఎంపీడీవో జె.తేజరతన్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకులు పాత్రుడు, సత్యవతి మాట్లాడుతూ తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించి నోషనల్ ఇంక్రిమెంట్‌లు మంజూరు చేయాలని, ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్‌లు మంజూరు చేయాలని, విభాగాల వారీగా పదోన్నతుల ఛానల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు కృష్ణ, నాగేంద్ర, శివ, రమేష్, మీనాక్షి, వెంకటలక్ష్మి, భారతి, లీలాప్రసాద్ పాల్గొన్నారు.

‘సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి’



జ్వరబాధితురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి జగదీశ్

చింతపల్లి,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎన్‌వీ జగదీశ్ అన్నారు. సోమవారం దిగజనబ గ్రామంలో ఆదివాసీలు వ్యాధులతో బాధపడుతున్నారని ఆశ కార్యకర్త ఇచ్చిన సమాచారంతో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ నుంచి పది కిలోమీటర్లు కాలినడక ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో 96 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. 15 మంది జ్వరబాధితులకు రక్తపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆదివాసీలు వ్యాధి సోకిన వెంటన ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.సాయిషా, హెచ్‌వీ అమ్మాజి, సర్పంచ్ రమేశ్ నాయుడు, ఏఎన్ఎం, పారామెడికల్ ఉద్యోగులు సోములమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతిభావంతులకు సత్కారం



క్రీడాకారులను సన్మానిస్తున్న దొన్నుదొర

అరకులోయ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్ ఇండియా నేషనల్ ఏబీ డీఆర్ఎస్ మీట్‌లో ప్రతిభ కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులను విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర సోమవారం సత్కరించారు. ఇటీవల జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చిన వారంతా చైర్మన్ దొన్నుదొరను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రతిష్టను పెంచేలా క్రీడల్లో సత్తాను చాటారని అభినందించారు. భవిష్యత్తులో జరిగే క్రీడల్లో మరింత ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో సత్తాచాటిన ఉద్యోగులకు సంస్థ ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెదలబుదు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టీడీపీ నేత శెట్టి బాబూరావు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

▸▸ జిల్లా పశు సంవర్థక శాఖాధికారి జయరాజు



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ జయరాజు

అనంతగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గాలికుంటు, డెక్కజడుపు వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేస్తున్నామని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ జయరాజు తెలిపారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ బంగారమ్మపేట, టోకూరు పంచాయతీ పూలుగుడ గ్రామాల్లో సోమవారం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తామన్నారు. 4.6 లక్షల టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు శ్రీనుబాబు, కాశీపట్నం పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు, అనిల్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

పాడేరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా చైతన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పాడేరు కాఫీహౌస్‌లో చేపడుతున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకుడు పెనుమాక రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోదమాంబ డిగ్రీ కళాశాలల్లో సోమవారం రక్తదానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తమ ట్రస్ట్ నుంచి బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎన్.రసూల్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి జి.గౌరీశంకరరావు, బీజేపీ నాయకులు సల్లా రామకృష్ణ, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి పంచాయతీ నుంచి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు అందుబాటులో ఉంటూ ఆదివాసీలకు మెరుగైన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మచ్చల మత్స్యరాజు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ గడుతూరి బాబూరావు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతి విద్యార్థినీ పదో తరగతిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సబ్జెక్టు పరంగా డౌట్స్ ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయులను సంప్రదించి వెంటవెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి జీవితంలో పదో తరగతి తొలి మెట్టు అని అన్నారు. అనంతరం ఆమె మెనూ ప్రకారం ఆహారం అందుతున్నది లేనిది ఆరా తీశారు. విద్యార్థులకు స్వయంగా ఆమె వడ్డించారు. కిచెన్‌రూమ్, స్టోర్ రూమ్, సిక్ రూమ్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్‌కు ఆదేశించారు.



కందమామిడి విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

పీఎం జన్‌మన్ లక్ష్యాలు గడువులోగా పూర్తి చేయాలి

పీఎం జన్‌మన్ పథకాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అన్నారు. సోమవారం ఆమె ఐటీడీఏ కార్యాలయంలో హౌసింగ్, డుమా, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈపీడీసీఎల్ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించారు. గడువు తేదీలోగా టార్గెట్‌లను పూర్తి చేయాలని, విలేజ్ విజిట్‌లకు వెళ్లి, సమస్యలను పరిష్కరించి ప్రోగ్రెస్ చూపాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

మెప్మా రిసోర్స్‌పర్సన్‌లకు ఉద్యోగ భద్రత : గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మెప్మా రిసోర్స్‌పర్సన్‌లకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించిందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. సెర్ప్, డీఆర్‌డీఏ రూపొందించిన మన డబ్బులు - మన లెక్కలు యాప్‌పై సోమవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పొదుపు సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న రిసోర్స్‌పర్సన్‌ల సేవలను ఆమె ప్రశంసించారు. స్త్రీ నిధి రుణాలను రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామైక్య మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందజేస్తుందన్నారు. అందులో రూ.10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తుందన్నారు. డీజీ లక్ష్మి పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, ఎంపీపీ సొనారి రత్నకుమారి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ డప్పోడి వెంకటరమణ, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

▸▸ ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాని వైనం

▸▸ సిబ్బంది కోసం లబ్ధిదారులు పడిగాపులు

సీలేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):జీకేవీధి మండలం సీలేరు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. సోమవారం ఉదయం 11 గంటలైనా సచివాలయం సిబ్బంది ఒక్కరూ కూడా విధులకు హాజరు కాలేదు. ఉదయం తొమ్మిది గంటల నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవడానికి, కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవడానికి, వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి లబ్ధిదారులు వేచి ఉన్నారు. ఉదయం 11 గంటలు అయినా ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరు కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలోనే అన్ని సేవలను అందించేందుకు సచివాలయాలను ఏర్పాటు చేస్తే సిబ్బంది మాత్రం సమయపాలన పాటించకుండా వారికి ఇష్టం వచ్చినప్పుడు విధులకు హాజరవుతున్నారని మండిపడ్డారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరారు.



సీలేరు సచివాలయంలో సిబ్బంది కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

కిల్కారీ ప్రోగ్రాం అమలుపై జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

పాడేరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారీ ప్రోగ్రాంను జిల్లాలో అమలు జరుగుతున్న తీరును కేంద్ర కిల్కారి అరమ్మాన్ పర్యవేక్షణ అండ్ మూల్యాంకనం(ఎంఅండ్‌టి) బృందం సోమవారం పరిశీలించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. వి.విశ్వేశ్వరనాయుడు తెలిపారు. తొలుత బృందం ప్రతినిధులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం తనిఖీ చేశారన్నారు. ఈ బృంద సభ్యులు కిల్కారి ప్రోగ్రాం గర్భిణులు, బాలింతలకు ఏవిధంగా ఉపయోగపడుతున్నది అడిగి తెలుసుకున్నారన్నారు. అనంతరం మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని కిండంగి, గుత్తులపుట్టు, దేవరాపల్లి గ్రామాలను బృందం సభ్యులు సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పథకం ఉపయోగాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద ప్రతినిధులు అమిత్, భూషన్, పీవో రాజు, జిల్లా డీపీహెచ్ఎన్‌వో జి.భూలోకమ్మ, తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్న కిల్కారీ పర్యవేక్షణ కేంద్ర బృంద ప్రతినిధులు

యూరియాను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీపీ

జి.మాడుగుల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అప్పలరాజు సూచించారు. సోమవారం స్థానిక సీఐ వెంకటరావుతో కలిసి యూరియాను రైతులకు అందజేశారు. మండలంలోని 20 టన్నులు యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో కె.వరప్రసాద్ తెలిపారు. పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వి.కొండలరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ టి.త్రిమూర్తులు, డైరెక్టర్ కె.కల్యాణం, సర్పంచులు రాంబాబు, కృష్ణమూర్తి, హనుమంతరావు, నాయకులు జీఎస్.దొర, వెంకటరమణ, భాస్కరరావు, కొండబాబు, గంతందొర తదితరులు పాల్గొన్నారు.



యూరియాను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, ప్రజాప్రతినిధులు

22 టన్నుల యూరియా పంపిణీ

సీలేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలోని గుమ్మిరేవుల, ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లోని గిరిజన రైతులకు సోమవారం 22 టన్నుల యూరియాను ప్రజాప్రతినిధులు పంపిణీ చేసినట్టు సీలేరు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. దుప్పులవాడ పంచాయతీలో ఆరు టన్నులు, ధారకొండలో 10 టన్నులు, గుమ్మిరేవులలో ఆరు టన్నులు యూరియా పంపిణీ చేశారన్నారు. 600 మంది రైతులకు యూరియా అందజేశారన్నారు. కార్యక్రమంలో ధారకొండ ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, , సర్పంచ్ ఎస్ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు డీలర్లకు అదనంగా 12 టన్నుల యూరియా

చింతపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ప్రైవేటు డీలర్లకు అదనంగా 12 టన్నుల యూరియా పంపిణీ చేశామని స్థానిక మండల వ్యవసాయ అధికారి టి. మధుసుదనరావు అన్నారు. సోమవారం మండలానికి వచ్చిన యూరియాను మూడు దుకాణాలకు నాలుగు టన్నులు చొప్పున కేటాయించామన్నారు. ప్రైవేటు డీలర్లకు గతంలో 40టన్నులు, తాజాగా మరో 12 టన్నులు ఇచ్చామన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియాను విక్రయించడం జరుగుతుందన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి

డుంబ్రిగుడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంతో ప్రధానమైన ఈ సమావేశం ఆలస్యంగా ప్రారంభించడం విశేషం. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు మొదలు పెట్టారు. సమయానికి సభ్యులు హాజరుకాలేదు. అలాగే గైర్హాజరైన కొన్ని శాఖ అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవోకు సూచించారు. దీనికితోడు అధికారులు కొంత మంది సర్పంచులకు ఎంపీటీసీ సభ్యులకు సమాచార నోటీసు ఇవ్వకపోవడంతో ఆలస్యంగా హాజరయ్యామని, సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఇన్‌చార్జి ఎంపీడీవోపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆయ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలోని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకు వెళ్లారు. గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదని పలువురు సభ్యులు మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించని సమావేశాలు నిర్వహించడం ఎందుకని వారు ప్రశ్నించారు. మండల ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలోజడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):గిరిజనులు పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని స్థానిక పశువైద్యాధికారి లోకుల రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పెదవలస, మంగళపాలెం గ్రామాల్లో 350 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. ఈకార్యక్రమంలో పెదవలస, దేవరాపల్లి సర్పంచ్‌లు వంశీకృష్ణ, బుజ్జిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజబాబు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలి

▸▸ వైస్ ఎంపీపీ భాగ్యవతి



రహదారి, కల్వర్టులు నిర్మించాలని ఆందోళన చేస్తున్న వైస్ ఎంపీపీ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడిగుమ్మ నుంచి గొబ్బరపడ గ్రామం వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి డిమాండ్ చేశారు. మండలంలోని రంగబయలు పంచాయతీ జోడిగుమ్మ, గొబ్బరిపడ గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరైనా రహదారి నిర్మాణం పనులు జరగడం లేదని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రహదారి, కల్వర్టులు నిర్మించాలని నీటిలో గ్రామస్థులతో కలసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో జోడిగుమ్మ నుంచి అర్లాయిపుట్టు మీదుగా గొబ్బరిపడ గ్రామం వరకు సుమారు 18 కిలో మీటర్ల పక్కా రహదారి పనులకు రూ.30 కోట్లు మంజూరయ్యాయని, ఏడాది గడిచినా పనులు ప్రారంభం కాలేదని, దీంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రోడ్డు విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ధనియా, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల రూపకల్పనకు సైన్స్ టీచర్లు కృషి చేయాలి : డీఈవో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో పి.బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టుల రూపకల్పనలో సైన్స్ ఉపాధ్యాయులు మరిన్ని మెలకువలను తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు లో కాస్ట్-నో కాస్ట్ మెటీరియల్‌తో సైన్స్ ప్రాజెక్టుల తయారీపై ఒక్క రోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు పరిసరాలలో దొరికే లో కాస్ట్-నో కాస్ట్ మెటీరియల్‌తో సైన్స్ ప్రాజెక్టులు తయారీపై అవగాహన కల్పించేందుకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రాజెక్టుల తయారీపై జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు త్రిమూర్తులు, ఆర్.శివనాగేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు, ఎంఈవో ఎం.జాన్, 30 మంది సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

▸▸ ఈగల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

అరకులోయ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని ఈగల్ డిపార్టుమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేవాలయాల్లాంటి కళాశాలల్లో కొందరు అక్రమ వ్యాపారులు యవతను ఆకట్టుకొని డ్రగ్స్ వ్యాపారంలో దించుతున్నారని, దీనివల్ల బంగారు భవిష్యత్తు పాడవుతుందని చెప్పారు. మాయమాటలు నమ్మి మోసపోవద్దని, డ్రగ్స్ జోలికి పోకూడదని సూచించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను అడియాసలు చేయకూడదని చెప్పారు. ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి అధికారిగా, నాయకుడిగా ఎదగాలని, అందుకోసం ఇప్పటి నుంచే లక్ష్యం నిర్దేశించుకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఈగల్ విభాగం అధికారులు విజయ్‌కుమార్, మల్లేశ్వరరావు, భాస్కర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అధికారులు, అధ్యాకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

‘టీచర్ల సమస్యలను పరిష్కరించాలి’

చింతపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరు శశికుమార్ అన్నారు. సోమవారం ఏపీటీఎఫ్ నాయకులు స్థానిక తహశీల్దార్ జి.ఆనందరావుకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, జోనల్ కార్యదర్శి బౌడు గంగరాజు, గౌరవాధ్యక్షుడు లోచలి చిట్టినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సరైన బోధనపై డీఆర్‌పీలకు శిక్షణ

పాడేరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సరైన బోధనపై సీఆర్పీలకు రెండు రోజుల పాటు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, అకాడమీ మోనటరింగ్ ఆఫీసర్ కె.భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన బేస్ లెవెల్ టెస్ట్ ఆధారంగా విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందించేందుకు డీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డీఆర్పీలు శిక్షణ అనంతరం మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో జ్ఞానప్రకాష్, ఏపీవో ఎంఎస్ఎల్.పాత్రుడు, ఎంఈవోలు ఎం.జాన్, సీహెచ్.సరస్వతీదేవి, డీఆర్‌పీలు నాగరాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

చింతపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):పశువుల్లో గాలికుంటు వ్యాధి నియంత్రణకు టీకాలు వేస్తున్నట్టు లోతుగెడ్డ పశువైద్యాధికారి డాక్టర్ మత్స్యరాస సౌజన్యదేవి అన్నారు. సోమవారం కొత్తపాలెం పంచాయతీ మామిడిపల్లిలో ప్రత్యేక పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో 110పశువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 15తేదీ నుంచి అక్టోబరు 15 తేదీ వరకు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వనగల సోమరత్నం, పశుసంవర్ధక సహాయక సిబ్బంది సంధ్య, మనోజ్, శివ, శివాజీ, మహేశ్, చిన్నారావు, దైవరత్నం, వాసుదేవ్ పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం రేపు

చింతపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా నియమించిన చింతపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు తెలిపారు. కొత్తపాలెం మాజీ సర్పంచ్ ఊర్మిళను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గానూ, టీడీపీ యువ నాయకుడు హశ్వంత్ వైస్ చైర్మన్‌గానూ, మరో 15 మందిని డైరెక్టర్లుగా నియమించిందన్నారు. టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేశామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, అంద్రాబు లక్ష్మణ్, మంగ్లు, వల్లి, సోమేశ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు పాల్గొన్నారు.

ఎల్లో బెల్ట్ విద్యార్థులకు అభినందనలు

పాడేరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో ఇటీవల పాండు కరాటే అకాడమీ, ఇంటర్నేషనల్ కోపూకాన్ కరాటే క్లబ్ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఎల్లో బెల్ట్ సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. సోమవారం సెయింటాన్స్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపాల్ అన్నమారియన, యాజమాన్యం ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాండు కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ కోపూకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇనస్ట్రక్టర్, ఎగ్జామినార్ బాకూరు పాండురాజు, పీడీలు గణేశ్, పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

‘పంప్డ్ స్టోరేజీ పనులు నిలుపుదల చేయాలి’

సీలేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీలేరులో ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించే పంప్డ్ స్టోరేజీ పనులు తమకు న్యాయం చేసిన తరువాతే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ సోమవారం పంప్డ్ స్టోరేజీ నిర్వాసితుల కమిటీ ప్రతినిధులు సోమవారం పాడేరులో ఐటీడీఏ పీఓ తిరుమణ శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి ఉన్న తమకు ఎటువంటి న్యాయం చేయకుండానే పనులు ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తక్షణమే ఆ పనులను నిలిపివేయాలని, తమకు న్యాయం చేసిన తరువాతే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు పీఐ స్పందించి తాను మీ ప్రాంతానికి వచ్చి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.



బాధిత కుటుంబానికి బీమా మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

స్మార్ట్ కార్డుతో ఏ డిపోలోనైనా సరకులు

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏ డిపోలోనైనా స్మార్ట్ కార్డును స్కాన్ చేసి రేషన్ సరకులు తీసుకోవచ్చునని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వారం రోజులు మాత్రమే పని చేసే రేషన్ డిపోలు నెలలో 25 రోజులు పనిచేసేలా చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వృద్ధులకు ఇంటికే వెళ్లి రేషన్ సరకులు సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రేషన్ డిపో డీలర్లు బాగా పనిచేస్తున్నారని, ఇంకా సేవలు మెరుగుపర్చి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం కె.కోటపాడు టీడీపీ కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కార్యకర్తలు ఎస్.అచ్చిబాబు, బి.స్వామినాయుడుకు చెందిన కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో సాంబశివరావు, రాష్ట్ర కొప్పుల వెలమ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, నియోజకవర్గం పరిశీలకులు వాసిరెడ్డి ఏసుదాసు, డైరెక్టర్ రొంగలి మహేశ్, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, నాయకులు పి.పాత్రుడునాయుడు, జూరెడ్డి రాము, ఎస్.రామునాయుడు, డి.డోకల నరసింహమూర్తి, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సహకార సంఘాలను లాభాల్లో నడపండి

దేవరాపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉన్న సహకార సంఘాలను లాభాల బాటలో నడిపించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని కలిగొట్లలో సోమవారం సహకార సంఘం ఛైర్మన్ దొగ్గ దేమున్నాయుడు, డైరెక్టర్లు కాసుబాబు, నరసింహనాయుడు సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ మంచి సేవలు అందించాలని సూచించారు. రూ4.5 కోట్లతో కలిగొట్ల వంతెన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. చౌడువాడ సబ్ స్టేషన్ పూర్తిచేసి కరెంట్ కష్టాలకు తీర్చుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు అనంతరం గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ దినేశ్‌కుమార్, పశు వైద్యాధికారి గాయత్రీదేవి, నియోజకవర్గ పరిశీలకులు వై.యేసుదాసు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ పీవీజీ కుమార్, కూటమి నాయకులు పి.వెంకటరమణ, పి.పాత్రునాయుడు, రామ్మూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చేయిచేయి కలిపి..

ఎర్రిగెడ్డ వాగుపై తాత్కాలిక వంతెన నిర్మించుకున్న రైతులు

చెక్ డ్యామ్ వద్ద తాటి దూలాలతో వారధి ఏర్పాటు



తాటి దూలాలతో తాత్కాలిక వంతెన నిర్మించుకుంటున్న రైతులు

చోడవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట రైతులు చేయిచేయి కలిపారు. గ్రామానికి, పొలాలకు మధ్యలో నుంచి వెళుతున్న ఎర్రిగెడ్డపై తాటి దూలాలతో తాత్కాలిక వారధి నిర్మించుకున్నారు. రాయపురాజుపేట గ్రామానికి ఆనుకుని వున్న ఎర్రిగెడ్డ వాగుకు అవతలవైపున ఈ పంచాయతీ రైతులకు సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములు వున్నాయి. ఈ వాగుపై వున్న వంతెన 2010లో సంభవించిన తుఫాన్‌కు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కొత్త వంతెన నిర్మించలేదు. దీంతో రైతులు చందాలు వేసుకుని ఇనుప గడ్డర్లు వేసి, వాటిపై తాటి దుంగలు పేర్చి తాత్కాలిక వంతెనను నిర్మించుకున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. పొలాలకు వెళ్లిరావడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటే సాహసం చేయాల్సి వస్తున్నది. దీంతో ఈ నెల 12న 'పట్టుతప్పితే ప్రాణాలు పోయినట్టే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. అయినా సరే అధికారుల్లో స్పందన లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో ఎర్రిగెడ్డలో వరద ఉధృతి తగ్గింది. దీంతో రైతులంతా కలిసి చెక్ డ్యామ్ వద్ద తాటి దూలాలతో తాత్కాలికంగా వంతెన నిర్మాణం చేపట్టారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎర్రిగెడ్డపై పక్కా వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలకు వ్యతిరేకంగా ఆందోళన

మాడుగుల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బెల్టు దుకాణాలకు వ్యతిరేకంగా ప్రజలుకు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ నియోకవర్గంలోని నాలుగు మండలాల్లో నిబంధనలను అతిక్రమించి మద్యం దుకాణాల పక్కనే మందుబాబులు మద్యం తాగుతున్నారన్నారు. అలాగే బడి, గుడి, జన సంచారానికి దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సింది పోయి, ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రాంతాల్లో దుకాణాలు పెట్టారని చెప్పారు. దీంతో యువత మద్యానికి బానిసై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో పాటు గ్రామాల్లో దుకాణాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమం ఉధృతంగా చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం దీనికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, నాయకులు కార్లి భవానీ, వంతల కేశవరావు, దాసు, పాంగి మత్స్యరాజు, శాంతి పాంగి విజయ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం

లంకెలపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామనగర్ కాలనీ, రామాలయం ప్రాంతాల్లో గత రెండు నెలల వ్యవధిలో జరిగిన రెండు దొంగతనాల కేసులను పరవాడ పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఐదున్నర తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు సోమవారం రాత్రి తెలిపిన వివరాలివి. లంకెలపాలెం దరి శ్రీరామనగర్ కాలనీలో నివాసముంటున్న సూరిశెట్టి వెంకటలక్ష్మి ఇంట్లో ఈ ఏడాది జూన్ 21న, రామాలయం వీధిలో నివాసముంటున్న దొంకాడ విమలాకుమారి ఇంట్లో జూలై 12న చోరీలు జరిగాయి. ఈ రెండు కేసుల్లో పదిన్నర తులాల బంగారం, 20 తులాల వెండిని దొంగలు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో విచారణ జరపగా తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి దరి పటాన్ చెరువు ప్రాంతానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం సమీపంలోని గంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణ చైతన్యలు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వీరిద్దరినీ సోమవారం మధ్యాహ్నం లంకెలపాలెం ఐటీసీ పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా, క్రైమ్ విభాగం అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

స్మార్ట్ కార్డులతో సులభతరంగా రేషన్

▸▸ వేలిముద్రలు పడవన్న ఆందోళన ఉండదు

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

▸▸ నియోజకవర్గంలో విస్తృత పర్యటన



చోడవరం: రేవళ్ల గ్రామంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డులతో గ్రామ స్థాయిలో సులభతరంగా రేషన్ సరకులు పంపిణీ అవుతాయని, ఇకపై వేలిముద్రలు పడలేదన్న ఆందోళన అవసరం లేదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. చోడవరంలోని అన్నవరం, ఎడ్లవీధి గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డుల ద్వారా సరకుల పంపిణీ సమయంలో లబ్ధిదారులు అనవసర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇకపై అలాంటి ఇబ్బందులు లేకుండా సులభతరంగా రేషన్ సరకులు అందుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఏటీఎం కార్డుల తరహాలో ఉన్న ఈ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులు జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు. దేవరాపల్లి మండలం కలిగొట్ల వద్ద గ్రోయిన్ నిర్మాణానికి ప్రతిపాదన ఇచ్చామని, తొలి దశలో కలిగొట్ల గ్రోయిన్ పూర్తిచేసి రేవళ్ల ప్రజలకు సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకటించారు. రావికమతంలోని తట్టబంద కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించాలని సూచించారు. అలాగే ఈ కార్డులు లబ్ధిదారులకు అందాయా? లేదా? అన్నది నాయకులు, కార్యకర్తలు పరిశీలించాలని సూచించారు. మండలంలో 22,246 మందికి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహశీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. కాగా, రావికమతం-తట్టబంద వయా తోటకూరపాలెం రోడ్డును అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు.



రావికమతం: తట్టబంద సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట మండలంలో ఎమ్మెల్యే రాజు సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా తురకలపూడిలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం దిబ్బిడి గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరిమర్శించారు. జొన్నపల్లి రాము, తాటికొండ శ్రీను మరణించడంతో, వారి కుటుంబాలను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వడ్డాదిలో రైతులకు యూరియా అందించారు. ఎరువుల విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమాల్లో బుచ్చెయ్యపేట తహశీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో బానోజీరావు, ఆర్ఐ శ్రవణ్, రావికమతం ఎంపీడీవో సీతారామస్వామి, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, బండి నూకాలమ్మ, ఎర్రంశెట్టి చిన్న, డీవీ.అప్పారావు, పప్పు శ్రీను, ఎలకా మల్లిబాబు, బొంతు దేముడుబాబు, గొర్లె సుధాకర్, కోమటి శంకరావు కోట నీలవేణి, గోకివాడ రమణ, పిల్లా శేషుబాబు, కోట గోవిందరావు, సింబోతు నాయుడు, కోన పరిదేశినాయుడు, గేదెల సత్యనారాయణ, డి.నాగేశ్వరిదేవి, జి.కోటేశ్వరరావు, ఎంవీవీ.సత్యనారాయణ, దొంకిన అప్పలనాయుడు, కోట సత్యనారాయణ, వై.గోవింద్, కె.రవి, జి.శ్రీనివాసరావు, ఎం.సూర్యనారయణ, దొండా గిరిబాబు, ఎస్.శ్రీరామూర్తి, ఎస్.శ్రీనివాసరావు, దొండా సన్యాసిరావు, ఎస్.రమేశ్ పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీలపై వైసీపీ మొసలి కన్నీరు'



భీమబోయినపాలెంలో వైద్య కళాశాల నిర్మాణాల వద్ద మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ మొసలి కన్నీరు కారుస్తున్నదని టీడీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలను పార్టీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు చినబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీపీపీ విధానం అంటే ప్రైవేటు పరం కానేకాదని, దీనిపై వైసీపీ యాగీ చేయడం తగదని పేర్కొన్నారు. ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యంతో ఈ కాలేజీ నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రూ.500 కోట్లతో నిర్మాణం చేపట్టిన కాలేజీ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, చేసిన పనులకు బిల్లులు కూడా వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదని వారు పేర్కొన్నారు. లేనిపోని అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ అవాస్తవ ప్రచారం చేస్తున్నదన్నారు. వైసీపీ నాయకులకు విధ్వంసం తప్పా మరేమీ తెలియదన్నారు. ఇప్పటికైనా చేతగాని మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రమణ, టీడీపీ నాయకులు జోగి పాత్రుడు, పోతల రాంబాబు, జమీందార్, చిరంజీవి, బుచ్చిరాంప్రసాద్, సురేశ్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన వారం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

చోడవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన వారం సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించి బోధనకు పరిమితం చేయాలని, సీపీఎస్ రద్దు చేసి 57 మెమో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.మహలక్ష్మినాయుడు, జిల్లా కార్యదర్శి దేముడుబాబు, చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ మండలాల ఏపీటీఎఫ్ నాయకులు చిరంజీవి, మల్లేశ్వరరావు, గొల్లు శ్రీనివాసరావు, సత్యనారాయణ, శేషుకుమార్, ఫణికుమార్, ఎం.గోవింద్, సింహాచలంనాయుడు, బీవీ కిశోర్, వి.గోవిందరావు, జిల్లా కౌన్సెలర్ కసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో వీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం విశ్రాంత ఇంజనీర్లు గొలుసు శ్రీనివాసరావు, కాకర్ల శివ సత్యనారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు వారి అనుభవాలను సభ్యులతో పంచుకున్నారు. గొలుసు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో ఎలాక్ట్రానిక్స్ చదవి ఎన్టీపీసీ డీజీఎంగా, జిందాల్ పవర్‌లో జనరల్ మేనేజర్‌గా చేసినట్టు తెలిపారు. విశ్రాంత పీఆర్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ చేసి పంచాయతీరాజ్ శాఖలో 30 సంవత్సరాలు పని చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, కార్యదర్శి బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంజనీర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ పద్మావతి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవిష్యత్తులో ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధ్యాపకులు కృష్ణంరాజు, త్రిమూర్తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అవంతి కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాటాడుతూ మోక్షగుండం విశేశ్వరయ్య విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టినవారే నిజమైన ఇంజనీర్లుగా పరిగణించపడతారన్నారు. పట్టుదల, నిబద్ధత, సమయపాలన, యువ ఇంజనీర్లకు ఆదర్శప్రాయమన్నారు.

అందరికీ యూరియా పంపిణీ చేయాలి



నాగాపురంలో నిరసన తెలుపుతున్న రైతులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురంలో అందరికీ యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిరసన తెలిపారు. గ్రామంలో 250 ఎకరాలల్లో 300 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని, 60 మందికే యూరియా పంపిణీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన రైతులకు కూడా తక్షణమే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి సుధారాణి స్పందిస్తూ, రైతు సేవా కేంద్రాలకు ఇంకా స్టాక్ రాలేదని, ఏఎల్‌పురం ప్రైవేటు దుకాణంలో ఉన్న స్టాకు నుంచి 60 మంది నాగాపురం రైతులకు యూరియా పంపిణీ చేశామని చెప్పారు. వారం రోజుల్లో స్టాక్ వస్తుందని, వెంటనే అందరికీ అందిస్తామని ఆమె తెలిపారు.

సమాజం గుర్తించేలా సేవలు అందించండి



ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలోని పోటీ పరీక్షల పుస్తకాలు చదివి ఉపాధ్యాయ, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, వారంతా సమాజం గుర్తు పెట్టుకునే విధంగా సేవలు అందించాలని పట్టణ సీఐ గోవిందరావు చెప్పారు. సోమవారం గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో ఉద్యోగాలు సాధించిన యువతకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. సమాజం గుర్తుపెట్టుకునేలా ప్రజలకు సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో ఎరువుల కొనుగోలు



యూరియా బస్తాలు తీసుకు వెళ్తున్న రైతులు

మాడుగుల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా బస్తాలను విక్రయించారు. ఈ కేంద్రానికి శనివారం 278 యూరియా బస్తాలు వచ్చాయి. అదే రోజు వీటిని విక్రయిస్తే తోపులాట జరుగుతుందని భావించిన ఏవో అనసూయ, ముందుగా 278 మందికి టోకెన్లను పంపిణీ చేశారు. సోమవారం ఉదయం నుంచి టోకెన్లు పొందిన రైతులంతా రైతు సేవా కేంద్రానికి వచ్చి యూరియా బస్తాలను తీసుకు వెళ్లారు. మరో రెండు రోజుల్లో యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని ఏవో తెలిపారు.

వడ్డాదిలో యూరియాకు ఎగబడ్డ రైతులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో సోమవారం ఉదయం నుంచి రైతు సేవా కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. వడ్డాదికి 24 మెట్రిక్ టన్నులుయూరియా తెప్పించినట్టు ఏవో భాస్కరరావు తెలిపారు. అవసరమైతే మరింత యూరియా తెప్పిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఆయన చెప్పారు. పోలీసు బందోబస్తు నడుమ రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించండి

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములపూడి బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని హాసిని మృతిపై విచారణ జరిపించాలని తల్లి రంగమణి కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో వీవీ రమణకు వినతిపత్రం అందించారు. తన కూతురు 11వ తేది అర్థ రాత్రి కడుపునొప్పితో బాధ పడుతుంటే తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. మర్నాడు ఉదయం వరకు హాస్పల్‌కి తీసుకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం వెంటనే సమాచారం ఇస్తే ఆస్పత్రికి తీసుకు వెళ్లి తన కూతురిని కాపాడుకునేవారమని ఆమె తెలిపారు. అదే రోజు రాత్రి హాసిని ఉంటున్న గదిలోకి పాము వస్తే చంపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ, కె.సూర్యప్రభ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు

గొలుగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికంటు వ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యమని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) డాక్టర్ రాంబాబు చెప్పారు. మండలంలోని గుండుపాల గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు రైతులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. సోమవారం నుంచి నెల రోజుల పాటు అన్ని ప్రాంతాల్లో పశువులకు టీకాలు వేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చూడి పశువులకు కూడా టీకాలు వేసుకోవచ్చునని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ప్రసాద్, శిరీషా, స్థానిక నాయకుడు గుమ్మిడి చినబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోండి

నాతవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నాతవరం ఎంపీహెచ్‌వో కె.వెంకటరమణ కోరారు. కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, మహిళలకు సమయానుకూలంగా వైద్య సేవలు అందించడమే ఈ శిబిరాల ముఖ్యోద్దేశమని తెలిపారు.

18న శాంతియుత నిరసన

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నడపడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఈ నెల 18న శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు అనుమతి కూడా తీసుకున్నామని ఆయన చెప్పారు.

3500 లీటర్ల బెల్లం పులుసు స్వాధీనం

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల, నర్సీపట్నం రూరల్ స్టేషన్ల పరిధిలోని బంగారయ్యపాలెం, బాపిరాజు కొత్తపల్లి గ్రామాల్లో సారా బట్టీలపై దాడులు చేసి 3500 లీటర్ల బెల్లం పులుసు స్వాధీనం చేకున్నామని రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసరావుకు సోమవారం అందిన ముందస్తు సమాచారంతో రూరల్ ఎస్ఐ రాజారావుతో కలిసి దాడులు చేశామన్నారు. సారా కాయడానికి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్టు చెప్పారు.

150 మందికి కంటి పరీక్షలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో 150 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఏఎల్ పురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర ప్రాంతాలకు చెందిన కంటి రోగులకు సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో కాకినాడ శ్రీకిరణ్ ఆస్పత్రి వైద్యులు లలితాకుమారి, నారాయణ, శ్రీనివాస్ కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పల్లి సత్యనారాయణ, జి.వెంకటరమణ, దరిశి సత్యనారాయణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

మొండికండిలో పశు వైద్య శిబిరం

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండికండి గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఏడీ రాంబాబు పాడి రైతులకు వివరించారు. వైద్య శిబిరంలో 42 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్జున్, టీడీపీ నేత శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సోమవారం వైసీపీ నాయకులు సన్మానించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, వడ్డాది పాఠశాల హెచ్ఎం నిమ్మల రమకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. వీరిని వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కె.రమణ, తల్లిదండ్రుల కమిటీ ఛైర్‌పర్సన్లు అప్పారావు, మనోహర్, స్థానిక నేత కె.జనార్ధనరావు సత్కరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రోలుగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. రోలుగుంటలోని మూడు డిపోల పరిధిలో 200 మందికి ఈ కార్డులను అందజేశారు. ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా ఈ కార్డులను ప్రభుత్వం తయారు చేసిందని ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసింహమూర్తి పాల్గొన్నారు

పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. వైద్య సేవలు అందుతున్న తీరును వారు పరిశీలించారు. రికార్డుల్లో నమోదు చేసిన బాలింతలు, కౌమార బాలికలు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో ఎ.రామచంద్రరావు, డీపీవోలు కె.జగదీశ్, జనార్దన్, వైద్యాధికారి కె.వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమ్మళ్లపూడి, గున్నెంపూడి, పెదమదిన, గ్రామాల్లో దివ్యాంగులకు సోమవారం సదరం ధ్రువ పత్రాలు విశాఖ డెయిరీ డైరెకర్ గేదెల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మంచానపడ్డ దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్ అందిస్తున్నదని చెప్పారు. సమాజంలో వారు గౌరవంగా బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చే నెల 5న సదరం స్లాట్లు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.


భయపెడుతున్న బ్రెయిన్ స్ట్రోక్

ఇటీవల గణనీయంగా పెరుగుతున్న కేసులు

- కరోనా తరువాతే ఈ పరిస్థితి అంటున్న నిపుణులు
- రక్తనాళాల్లో క్లాటింగ్ మెకానిజం పెరగడమే కారణం
- గతంలో 50 ఏళ్లు దాటిన వారిలోనే సమస్య
- తాజాగా యువతలోనూ వెలుగులోకి
- జీవన విధానంలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, బీపీ, షుగర్, ఆల్కహాల్, ధూమపానం లాంటి అలవాట్లూ కారణమే
- కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 మంది బాధితులు



విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'రామ్‌నగర్‌కి చెందిన రాజేష్ (38) స్నేహితులతో కలిసి అప్పటివరకు ఉత్సాహంగా క్రికెట్ ఆడాడు. ఆట ముగిసి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమ య్యారు. ఒక్కసారిగా వాంతులు, కళ్లు తిరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. కాళ్లు, చేతులు పడిపోయాయి. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌స్ట్రోక్‌గా నిర్ధారించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేశారు'.



ఇటీవల ఈ తరహా కేసులు పెరుగుతున్నాయి. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వారు ఒక్కసారిగా కుప్ప కూలిపోతున్నారు. పరీక్షలు చేస్తే బ్రెయిన్‌స్ట్రోక్‌గా తేలుతోంది. దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. గతంలో 50 ఏళ్లు దాటిన వారు, వృద్ధుల్లో మాత్రమే కనిపించే స్ట్రోక్ ఇప్పుడు 30 ఏళ్లలోపు యువతలోనూ వెలుగుచూడడం ఆందోళనకు గురిచేస్తోంది. కరోనా తరువాత యువతలో బ్రెయిన్, హార్ట్‌స్ట్రోక్ సంఖ్య పెరిగిందని, దీనికి రక్తాన్ని గడ్డ కట్టించే మెకానిజం శరీరంలో వృద్ధి చెందడమే కారణమంటున్నారు. దీనిపై పూర్తిస్థాయి అధ్యయనాలు లేకపోవడంతో నిర్దిష్ట కారణాలు తేలడం లేదు. అంతే కాదు జీవన విధానంలో మార్పులు, ఆహార అలవాట్లు సమస్య తీవ్రతకు కారణమంటున్నారు.

గణనీయంగా పెరిగిన కేసులు..

నగర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు ప్రతిరోజూ పదుల సంఖ్యలో వస్తున్నారని చెబుతున్నారు. కేజీహెచ్‌కు ప్రతిరోజూ 30 మంది వస్తుంటారని, వీరిలో ఇస్కీమిక్ స్ట్రోక్ బారినపడి మూడు గంటల్లో ఆస్పత్రికి తీసుకు వచ్చిన వారు మూడు రోజులకు ఒకరు మాత్రమే ఉంటారని, వారికి ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేస్తున్నామంటున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు ప్రతి రోజూ మరో 150 వరకు కేసులు వస్తుంటాయన్నారు. దేశంలో 20 సెకన్లకు ఒక బ్రెయిన్‌స్ట్రోక్ కేసు నమోదవుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

బ్రెయిన్ స్ట్రోక్ అంటే.?

మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్ప డడాన్ని స్ట్రోక్ అంటారు. దీనివల్ల రక్తనాళం పగలడం, మెదడు కణజాలం చని పోవడంతో శరీరంలోని భాగాలు చచ్చుబడిపోతాయి. దీనిని పక్షవాతంగా పేర్కొంటారు. బ్రెయిన్ స్ట్రోక్ రెండు రకాలు. మొదటి ఇస్కీమిక్ స్ట్రోక్. బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో 85 శాతం ఇవే ఉంటాయి. మెదడుకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల వచ్చే స్ట్రోక్ ఇది. రోగిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పితే ఒక ఇంజక్షన్ ఇచ్చి గడ్డను కరిగించి, కోలుకునేలా చేస్తారు. రెండోది బ్రెయిన్ హెమరేజ్. ఇందులో బ్రెయిన్‌లో తీవ్రమైన రక్తస్రావం అవుతుంది.

ముందే గుర్తించే చాన్స్..

బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడడానికి ముందే కొన్ని లక్షణాలు అప్రమత్తం చేస్తాయి. వాటిని గుర్తించి ఆస్పత్రిలో చేరితే బయటపడేందుకు అవకా శం ఉంది. కాళ్లు, చేయి పడిపోవడం, మూతి పక్కకు వెళ్లడం, మాట పడిపోవడం, నడిస్తే తూలి పోవడం, తిమ్మిర్లు, అన్నం దిగకపోవడం వంటి లక్షణాలు కొన్ని క్షణాల నుంచి పది నిమిషాలు వరకు ఉండి, తిరిగి సాధారణ స్థితికి వచ్చేస్తారు. దీనిని ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ అటా క్ (టీఐఏ) అంటారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తం కావాలి. లేదంటే కొద్దిరోజుల్లో తీవ్రమైన స్ట్రోక్ బారిన పడే ప్రమాదం ఉంది. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందరికీ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

అధిక బీపీ, షుగర్, పొగ, మద్యం వంటి అలవాట్లున్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువ. శారీరక శ్రమ లోపించడం, స్థూలకాయం, ఒత్తిడి, రక్తంలో కొవ్వులు, ఆకు కూరలు, పండ్లు తీసుకోకపోవడం, జంక్‌ఫుడ్, ఆయిల్‌ఫుడ్ తీసుకోవడం, బయటి ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం, గురక, మత్తు పానీయాలు, మాంసాహారం అధికంగా తీసుకోవడం వంటి అంశాలు స్ట్రోక్‌కు దారితీస్తున్నాయి.

ఇవీ లక్షణాలు..

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో చేయి, కాలూ చచ్చుపడి పోవడం, మూతి పక్కకు లాగేయడం, కళ్లు తిరగడం, శరీరం తూలడం, ఒక వైపు చూపు తగ్గిపోవడం, మింగడం కష్టంగా ఉండడం, ఇద్దరు, రెండుగా కనిపించడం, స్పృహ తప్పిపోవడం, అకస్మాత్తుగా వాంతులు కావడం, అపస్మార స్థితిలోకి వెళ్లిపోవడం వంటి లక్షణాలుంటాయి.

సకాలంలో ఆస్పత్రికి తరలించాలి



ఆహార అలవాట్లు, జీవనవిధానంలో మార్పులే బ్రెయిన్‌స్ట్రోక్‌కు కారణం. బాధితుడిని మూడు గంటల్లోపు ఆస్పత్రికి తీసుకువస్తే ఓ ఇంజక్షన్ ఇచ్చి కోలుకునేలా చేస్తున్నాం. దురదృష్టవశాత్తు 100 మందిలో ఒకరిని మాత్రమే సకాలంలో తీసుకువస్తున్నారు. స్ట్రోక్స్‌ను ఎంఆర్ఐ, సీటీ పరీక్షల ద్వారా గుర్తిస్తాం. 25 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీపీ, షుగర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించుకోవాలి. లిపిడ్స్ అధికంగా ఉన్నా స్ట్రోక్ వస్తుంది. దురలవాట్లకు దూరంగా ఉంటూ శారీరక శ్రమ, వ్యాయామాలు చేయాలి. కాలుష్యం కూడా కారణమవుతోంది. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వాలి. క్లాటింగ్ మెకానిజాన్ని నిర్ధారించే పరీక్షలు చేయించుకుని మందులు వాడితే ప్రయోజనం ఉంటుంది.

- డాక్టర్ గోపి,
న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

సీఎం చంద్రబాబు రాక రేపు

... 5వ పేజీ తరువాయి

కోస్టల్ బ్యాటరీ వద్ద 11.15 గంటలకు దిగుతారు. అక్కడి నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ సాగరిక ఫంక్షన్ హాలుకు చేరుకొని విమెన్ అండ్ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు అక్కడ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీకి చేరుకొని హెలికాప్టర్‌లో తాడేపల్లి వెళతారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో సోమవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు, పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై చర్చించి, పలు సూచనలు చేశారు.

కాలువ గండిని పూడ్చరా?

- ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం
- స్పీకర్ అయ్యన్న ఆదేశించినా బేఖాతరు
- నీరు అందక ఎండిపోతున్న వరినాట్లు

మాకవరపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మాకవరపాలెం మెరక కాలువకు పడిన గండిని అధికారులు ఇంతవరకు పూడ్చలేదు. వరి పొలాలకు నీరు రాకపోవడంతో నాట్లు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్పా నుంచి మాకవరపాలెం మెరక కాలువ ద్వారా మూడు గ్రామాలకు చెందిన సుమారు 500 ఎకరాలను సాగునీరు అందుతుంది. భారీ వర్షాల కారణంగా గత నెల 20వ తేదీన మెరక కాలవకు గండిపడింది. ఈ విషయం స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి రావడంతో సత్వరమే గండి పూడ్చివేత పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇది జరిగి 25 రోజులు దాటినా.. ఇంతవరకు గండిని మాత్రం పూడ్చలేదు. మధ్యలో ఒకసారి రైతులు శ్రమదానంతో గండిని తాత్కాలికంగా పూడ్చుకున్నారు. తరువాత మళ్లీ భారీ వర్షాలు పడడంతో గతంలో గండిపడిన ప్రదేశంలోనే మళ్లీ గట్టు తెగిపోయింది. అప్పటి నుంచి పొలాలకు నీరు పారడంలేదు. వరినాట్లు వేసిన పొలాల్లో నీరు లేకపోవడంతో కలుపు విపరీతంగా పెరిగిపోతున్నదని, కొన్నిపొలాల్లో వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరకు కాలువ గండి పూడ్చి వేత పనులు చేపట్టాలని కోరుతున్నారు.



మెరక కాలువ గండి పూడ్చకపోవడంతో వృథాగా పోతున్న నీరు

యూరియాకు పరుగులు

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నాలు చేస్తున్నారు.

చోడవరం సబ్ డివిజన్ పరిధిలో చాలావరకు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువుల సరఫరా చేపట్టారు. నరసాపురం పంచాయతీ పరిధిలోని రైతులకు రాయపురాజుపేట సహకార సంఘం ద్వారా ఎరువులు సరఫరా చేశారు. అయితే కొంతమందికి మాత్రమే యూరియా అందడంతో మిగిలిన రైతులు ఎదురుచూస్తున్నారు. మరింత యూరియాను రప్పించడానికి పీఏసీఎస్ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. అయితే యూరియా రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండడంతో, నరసాపురం రైతులు ఇతర పంచాయతీల రైతు సేవా కేంద్రాలు, చోడవరంలోని ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దుడ్డుపాలెం, నరసయ్యపేట తదితర గ్రామాలకు ఇంతవరకు యూరియా సరఫరా కాలేదని రైతులు చెబుతున్నారు. ఈ పంచాయతీల్లో మంగళవారం నుంచి యూరియా సరఫరా చేస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, రైతులందరికీ నిర్ణీత సమయంలో అందుతుందని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల ద్వారా యూరియా సరఫరా చేశామని, ఇంకా ఎక్కడైనా అవసరమైతే అదనంగా ఇండెంట్ పెట్టి రప్పిస్తామని అధికారులు చెబుతున్నారు. వారం, పది రోజుల్లో పుష్కలంగా యూరియా సరఫరా అవుతుందని, అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలి

- అధికారులకు జేసీ ఎం.జాహ్నవి ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్ఓ సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి జేసీ మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన అర్జీల గురించి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి వాటి వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలన్నారు. అర్జీల్లో పేర్కొన్న సమస్య పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. కాగా పీజీఆర్ఎస్‌లో 313 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు, జేసీ ఎం.జాహ్నవి

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అర్జీలను అందజేసిన వారితో నేరుగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించి న్యాయపరంగా వాటి పరిష్కారానికి దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు 40 అర్జీలు అందినట్టు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విజన్-2047

... 5వ పేజీ తరువాయి

యంగ్ ప్రొఫెషనర్లను ఇతర ప్రాంతాలకు చెందిన వారిని నియమించారు.

పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం పైఅంతస్థులో విజన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. యంగ్ ప్రొఫెషనర్‌గా బాపట్లకు చెందిన అధికారిని నియమించారు. విజన్ సెంటర్‌కు నియోజకవర్గ ఎమ్మెల్యే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నియోజకవర్గం ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా, ఎంపీడీవో కో-కన్వీనర్‌గా వుంటారు. నియోజకవర్గంలోని ప్రజల స్థితిగతులు, సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఇతర కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక్కో కేంద్రానికి ఎంపిక చేసిన ఐదురుగు సచివాలయ సిబ్బందిని నియమించారు. ఈ నెలాఖరునాటికి పనులన్నీ పూర్తిచేసి అక్టోబరు 2వ తేదీ నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజన్ సెంటర్ల సేవలన అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నది. స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పది సూత్రాలను నూరుశాతం అమలు చేయడమే లక్ష్యంగా విజన్-2047 కేంద్రాలు పనిచేస్తాయి. వీటిల్లో పేదరిక నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలన-ఉపాధి అవకాశాలు, మానవనరుల వినియోగం-శిక్షణ, నీటి సంరక్షణ, వ్యవసాయంలో సాంకేతిక వినియోగం, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, కాస్ట్ ఆప్టిమైజేషన్ ఎనర్జీ అండ్ ఫ్యూయల్, ప్రోడక్ట్ పర్‌ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్- ఆల్ వాక్స్ ఆఫ్ లైఫ్ అంశాల అమలు, వాస్తవ పరిస్థితిపై విజన్ సెంటర్లు నడిచేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. ఎంపికైన సచివాలయ సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు.

వేగవంతంగా విజన్ సెంటర్ పనులు

డి.సీతారామరాజు, ఎంపీడీవో, నక్కపల్లి



మండల పరిషత్ కార్యాలయంలో విజన్-2047 కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు, పది సూత్రాలకు సంబంధించి నాలుగు మండలాల నుంచి సమాచారం, వాస్తవ పరిస్థితిని ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పంపించడం జరుగుతుంది. విజన్ కేంద్రానికి అవసరమైన సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ కేంద్రం వల్ల ప్రజలకు పలు రకాలుగా మేలు జరుగుతుంది.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

... 5వ పేజీ తరువాయి

క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. క్షయ వ్యాధి స్ర్కీనింగ్, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు చేస్తారు. 17వ తేదీన జిల్లావ్యాప్తంగా 46 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. చిన్న పిల్లల దగ్గర నుంచి 49 ఏళ్ల లోపు మహిళలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి తెలిపారు.

క్రైం... crime news

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు

సీలేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు మీదుగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసిన, ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీలేరు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గంజాయి రవాణాపై పోలీసులకు ముందస్తు సమాచారం రావడంతో స్థానిక జెన్‌కో చెక్‌పోస్టు వద్ద సోమవారం ఉదయం వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా బ్యాగులో ఐదు కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఆ ఇద్దరిలో ఒకరు తప్పించుకున్నారని, మరొకరిని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుడు కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన జి.గోవిందరాజుగా గుర్తించామన్నారు. అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పాడేరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయప డ్డాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. హుకుంపేట మండలం డి.చింతలవీధి పంచాయతీ దాలిగుమ్మడి గ్రామానికి చెందిన అర్లాబు థామస్ ప్రవీణ్(27) సోమవారం సాయంత్రం హుకుంపేట నుంచి పాడేరు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆ సమయంలో చింతలవీధి సమీపంలోని పెట్రోల్ బంకు నుంచి బయటకు వస్తున్న ఎక్స్‌కవేటర్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో అతనిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై ఎస్ఐ ఎల్.సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు చోట్ల విజిలెన్స్ దాడులు

- ఎరువులు, పీడీఎస్ బియ్యం స్వాధీనం

రావికమతం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చోట్ల సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. మేడివాడలో గల కిరాణా దుకాణంలో ఎరువులు, పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు విజిలెన్స్, మండల వ్యవసాయాధికారి, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆ దుకాణంలో అనుమతులు లేకుండా యూరియా, పొటాష్, ఎస్ఎస్పీ, అమోనియం సల్ఫేట్, తదితర ఎరువులతో పాటు పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. కొనగళ్ల సురేశ్‌కు చెందిన కిరాణా దుకాణంలో బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 15 బియ్యం బస్తాలు, 9 అమోనియం సల్ఫేట్ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పసుమర్తి సంతోశ్ కిరాణా దుకాణంలో 20 బస్తాల పొటాష్, ఐదు బస్తాల ఎస్ఎస్పీ నిల్వ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ రెండు దుకాణాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఉన్న బియ్యం, ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శంకర్‌లాల్‌నాయక్ తెలిపారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు, ఎరువుల బస్తాలను వ్యవసాయశాఖాధికారులకు అప్పగించామన్నారు. ఆ ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయాధికారి రమేశ్‌బాబు, ఆర్ఐ ఐ.రమణ, వీఆర్వో సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మేడివాడలోని కిరాణా దుకాణంలో ఎరువులు, పీడీఎస్ బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఏటిగైరంపేటలో...

గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. ఆ గ్రామంలో శ్రీవెంకటరాజా షాపులో ఎటువంటి బిల్లులు లేకుండా విక్రయిస్తున్న పొటాష్, సూపర్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

నర్సీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పెదబొడ్డేపల్లి పాత పంచాయతీ కార్యాలయం దగ్గరలో చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదబొడ్డేపల్లికి చెందిన ఉద్దడం దేవుడమ్మ(60) సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటి పెరట్లో బ్రష్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఒక మహిళ ఆమె మెడలోని బంగారం పుస్తెల తాడు లాక్కొని పోయేటప్పుడు వృద్ధురాలు ప్రతిఘటించింది. దీంతో వృద్ధురాలు కింద పడిపోయి తీవ్రంగా గాయపడడంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. దేవుడమ్మ ఇంటి సమీపంలో టిఫిన్ సెంటర్ నడిపే మహిళే చైన్ స్నాచింగ్‌కి పాల్పడి ఉండవచ్చునని బాధితురాలు అనుమానం వ్యక్తం చేసిందని సీఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జడ్పీ స్థలాలను స్వాధీనం చేసుకోండి

- అధికారులకు చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం

కొత్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరులో ఆక్రమణకు గురైన జిల్లా పరిషత్ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ముత్రాసు కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలుకు మూడు ఎకరాలను కేటాయించాలని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ముత్రాసి కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సరైన ఆట స్థలం లేకపోవడాన్ని ఈ సందర్భంగా గుర్తించారు. కొత్తూరు వద్ద శారదా నదిని ఆనుకొని జిల్లా పరిషత్‌కు చెందిన 12 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బందిని ఆదేశించారు. ఆంజనేయ స్వామి ఆలయానికి పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించి స్కూలు కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తరువాత ఆమె ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. కొత్తూరులో నిర్మితమైన నూతన భవనంలోకి ఆర్డీవో కార్యాలయాన్ని తరలించి జిల్లా పరిషత్ అతిథిగృహాన్ని (చాలా కాలం నుంచి ఆర్డీవో కార్యాలయం, జడ్పీ అతిథిగృహంలో నడుస్తున్నది) తిరిగి తమకు అప్పగించాలని ఆర్డీవో ఆయిషాను కోరారు. పది రోజుల్లో అతిథిగృహాన్ని ఖాళీ చేసి అప్పగిస్తామని ఆర్డీవో చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ వెంట ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో పి.ఆశాజ్యోతి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహాసత్యవతి, తదితరులు వున్నారు.



ముత్రాసి కాలనీలో జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

విరివిగా డీసీసీబీ రుణాలు

... 5వ పేజీ తరువాయి

అవకతవకల కారణంగా రూ.53 కోట్ల వరకు నిరర్థక బాకీలుగా గుర్తించామని, వీటికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఆయన వెంట డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గెడ్డం కన్నబాబు వున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559